# రవీంద్ర గీతాంజలి

## అనువాదం:గాయత్రి



(గతసంచిక నుంచి తరువాయి)

***41***

**నీడల మాటున,** వాళ్ళందరి వెనుక నిలుచొని ఎక్కడ ఉన్నావు నా సఖా? లెక్కచేయక వాళ్ళు నిన్ను నెట్టుకుంటూ దాటుకొంటున్నారా దుమ్ము బాటలో? నేనిక్కడ నీకై నైవేద్యంతోవేసటగా గంటలకొద్దీ వేచి వున్నా. దారిన పోయేవాళ్ళు, ఒక్కొక్కరుగా నా పూలు తీసుకెళుతున్నారు. పూలసజ్జె రిక్తమైంది.

పొద్దు గడిచిపోయింది. సాయంత్రం నీడలో నా కళ్ళు నిదురతో మూసుకుంటున్నాయి. ఇళ్ళకు వెళుతున్న వారు నాకేసి చూసి నవ్వి నన్ను సిగ్గుతో ముంచుతున్నారు. బిచ్చగత్తెలా కూర్చొన్న నేను పరికిణీలో ముఖం దాచుకొన్నా. నాకేం కావాలని వారడిగినప్పుడు, నా కళ్ళు దించుకుంటా. బదులివ్వను.

అయ్యో! నీ కోసమే నా నిరీక్షణమనీ, నీవొస్తానని మాటిచ్చావనీ ఎలా చెప్పను?

నా బీదరికాన్ని వరకట్నంగా దాచుకొన్నావని సిగ్గు విడిచి ఎలా చెప్పడం? ఆహా! నా ఈ భాగ్యాన్ని గుండెలో రహస్యంగా హత్తుకొంటా!

పచ్చికలో కూర్చొని, ఆకాశంలేసి చూస్తూ, నీ రాకలోని ధగధగల్ని కలగంటున్నా. దివ్వెలన్నీ వెలిగాయి. నీ రథం బంగారురేఖలు వెదజల్లుతోంది. బాట పక్కన నిలబడిన వాళ్ళు ఆశ్చర్యంగా చూస్తూండగా, నీ ఆసనం నుండి దిగి, వేసవి తాపానికి వణికే లతలా, సిగ్గు గర్వం కలబోతలో కలిగే వణుకుతో అదురుతున్న ఈ బిచ్చగత్తెను, దుమ్మునుండి లేవదీసి నీ సరసన కూర్చోబెట్టుకున్నావు.

కానీ, సమయం గడుస్తోన్నా నీ రథ చక్రాల సవ్వడి లేదాయె! ఎన్నో ఊరేగింపులయ్యాయి. చప్పట్లతో , తూణీరాలతో , కీర్తిభూషణాలతో, వారందరి వెనుక నిశ్శబ్దపు నీడలో నిల్చొన్నది నీవేనా? నేను మాత్రమేనా వృధా కోరికలా అలసిన హృదయంతో శోకిస్తూ నిరీక్షిస్తున్నది!?

***

*42*

**ఉదయాన్నే వర్తమానం**

నీతోటి నావలో ప్రయాణమని
అనంతతీరాల యాత్ర
ఇంకెవ్వరెరుగరీ ధాత్రిలో!
తీరంలేని సంద్రంలో
నీ మౌన దరహాసం ముందు
స్వేఛ్ఛా అలలై
పదబంధాలనుండి విడివడిన
నా పాటలను మధుర స్వరాలుగా వినిపిస్తా!
సమయమింకా కాలేదా?
పనులింకా మిగిలిపోయాయా?
అయ్యో! తీరంపై సాయంత్రం ముంచుకొచ్చింది
మసక వెలుతురులో
సంద్రం పక్షులు
తమ గూళ్ళకేసి వస్తున్నాయి!
సంకెళ్ళు ఎపుడు తెగుతాయో
ఎవరికెరుక?
సాయం సంధ్య ఆఖరి ఆశా రేఖలా
నావ చీకట్లో ఎపుడు కనుమరుగౌతుందో
ఎవరికి తెలుసు?

***

*43*

**నీ కొరకై సిద్ధంగా లేని రోజున**
నా ఎదలోకి నాకు తెలీకుండా
గుంపులో ఒకనిగా జొరబడి
నా జీవితంలో
ఎన్నో చిన్న చిన్న సంఘటనలపై
నీదైన శాశ్వత ముద్రవేశావు!
అనుకోకుండా ఈ రోజున
ఆ తలపుల వెలుగులో
నీ సంతకం చూశా
మరచిన ఆ గుర్తింపు లేని రోజులు
సుఖదుఃఖాల స్మృతులతో కలసి
దుమ్ముపట్టి చిందరవందరగా పడున్నాయి!
దుమ్ములో నా పిల్ల చేష్టలుచూసి
ధిక్కరించి పోలేదు నువ్వు
నా ఆట స్థలంలో నేవిన్న పదధ్వని
నక్షత్రాంతరాళాలలోని ప్రతిధ్వనిలానే ఉంది!

***

*44*

**వెలుగును వెంటాడే నీడలని**
వేసవిలో కురిసే వర్షాన్నీ
బాట పక్కనుండి వేచి చూడ్డం
నాకెంతో ఇష్టం!
తెలియని గగనాలనుండి
సందేశం తెచ్చిన వార్తాహరులు
పలకరించి వేగంగా వెళ్ళిపోయారు
నా ఎదలోపల ఆనందం
పయనించే గాలి తీపి ఊపిరులూదుతోంది!
తొలిసంధ్య నుండి మలి సంధ్యవరకూ
నేనిక్కడే నా వాకిట ముంగిట కూర్చొన్నా
ఆనంద క్షణాలు ఆకస్మాత్తుగా వస్తాయని తెలుసు
ఈ లోపున
ఒంటరిగా
నవ్వుతూ పాడుకొంటా
ఇంతలో నమ్మకాల పరిమళాలతో
గాలి నిండుతోంది!!

***

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

POST YOUR COMMENTS